



స్కాలర్ షిప్ పరీక్షకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జాతీయ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్షిప్ పరీక్ష కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) కోసం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థుల కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50లక్షలు లోపు ఉండాలని తెలిపారు. డిసెంబర్ 8న ఈ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో ఈనెల 5 నుంచి సెప్టెంబర్ 6లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ప్రభుత్వ పరీక్షల సంచాలకులు కార్యాలయపు వెబ్ సైటు www.bse.ap.gov.in, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పని వేళల్లో తెలుసుకోవాలన్నారు.



కురుపాం : రోగితో మాట్లాడుతున్న అజశర్మ

మెడికల్ కాలేజీ నిర్మించాలి

- సూపర్ స్పెషాలిటీ పనులు త్వరగా పూర్తి చేయాలి
- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్/సీతంపేట/కురుపాం

పార్వతీపురంలో మెడికల్ కాలేజీ నిర్మించాలని, సూపర స్పెషాల్టీ ఆసుపత్రి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ.అజశర్మ డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఆయన పార్వతీపురం, కురుపాం, సీతంపేట ప్రభుత్వాసుపత్రులను పరిశీలించారు. ఈ మేరకు పార్వతీపురం జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వాసుపత్రిని, నిర్మాణంలో గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను సందర్శించారు. పలు వార్డుల్లో ఉన్న రోగులను కలిసి వారి సమస్యలతో పాటు భోజనం మెనూలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందిని వర్కర్లను ఆస్పత్రి పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ బి.వాగ్దేవిని కలిసి వైద్య అభివృద్ధికి చేపడుతున్న కృషిపై చర్చించారు. ఈ సందర్భంగా అజశర్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పేదలకు వైద్యమందించే ప్రభుత్వాసుపత్రుల్లో పార్వతీపురం ఒకటని, ఇందులో 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తెచ్చిద్దినా అభివృద్ధి పరచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సరైన సౌకర్యాల్లేకపోవడంతో ఒక పడకపై ఇద్దరు చొప్పున రోగులు ఉండడం చాలా దౌర్భాగ్యమని అన్నారు. కొన్ని వార్డుల్లో శుభ్రత లేదని, పెచ్చులు ఊడిపోయి గచ్చులు, మెస్సుల్లేని కిటికీలతో చాలా అధ్వానంగా ఉందని, టాపులు లీకై నీరు వృథాగా పోతున్నాయని తెలిపారు. రోజుకు 250 నుండి 300మంది రోగులు వస్తున్నా వారికి మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్య సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉందన్నారు. 32 మంది వైద్యుల్లో ముగ్గురే రెగ్యులర్ సిబ్బంది ఉండడం అన్యాయమని వాపోయారు. అధిక మొత్తంలో గర్భిణులు ఆసుపత్రికి వస్తున్నారని, కానీ గైనిక్ వైద్యులు ఇద్దరే ఉన్నారని, వెంటనే మరి కొంతమంది నియమించాలని కోరారు. జిల్లా కేంద్ర ఆస్పత్రి మరింత అభివృద్ధి జరగాలంటే పేదలకు చేరువలో మెరుగైన వైద్య అభివద్ధి కొరకు గైనకాలజిస్ట్, కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్టులను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులో రక్తనిధి కేంద్రాలు లేకపోవడం దౌర్భాగ్యమని, గిరిజనులు మహిళలు, చిన్నారులు రక్తహీనతతో అనేక రకాలుగా బాధపడుతున్నారని వెంటనే కురుపాం, పాలకొండ, పార్వతీపురం సాలూరు ఆసుపత్రుల్లో రక్త నిధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను త్వరితగా పూర్తి చేయాలని, సాంకేతిక వైద్య పరికరాలతో అభివద్ధి చేపట్టాలని అన్నారు. నర్సులు, స్కావెంజర్స్, వైద్య సిబ్బందిని, వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేటు, ఏ ఇతర ప్రాంతాల ఆసుపత్రులకు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వ వైద్యులపై ఉందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవిని కోరారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు ప్రదీప్‌కుమార్, ప్రసాదరావు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు, సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు టి.అఖిల్, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక వంద పడకల ఏరియా ఆసుపత్రిలో అదనపు భవనాలు పనులు సత్వరమే పూర్తి చేయాలని ఉత్తరాంధ్ర అభివద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. భవనాల కొరతతో కేసులను ఇతర ఆసుపత్రులను రిఫరల్ చేయాల్సి వస్తుందని అన్నారు. కావున తక్షణమే భవనాలను నిర్మించాలని కోరారు. రోగులకు ఎటువంటి వైద్యం అందుతుందో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆసుపత్రిలో వైద్య సేవలో మెరుగ్గా ఉండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట గిరిజన సంఘం నాయకులు ఎం తిరుపతిరావు భాస్కరరావు శ్రీరాములు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

కురుపాం : ఆసుపత్రిలో మౌలిక వసతులతో పాటు వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచి ప్రజలకు వైద్య సేవలు సంపూర్ణంగా అందేలా చూడాలని, అరకొరగా వైద్య సేవలు అందించడం ప్రభుత్వానికి తగదని అజ శర్మ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం అడిగి గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో గల ఒపి, బ్లడ్, బ్యాంకు, ల్యాబ్, రోగులకు అందుతున్న మెనూ క్షుణంగా పరిశీలించి ఆస్పత్రి సూపరింటెడెంట్ డాక్టర్ శోభారాణికి వైద్య సిబ్బంది వివరాలు, ఆసుపత్రిలో మౌలిక వసతులు, రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కువ మలేరియాతో వ్యాధితో ప్రజలు బాధపడుతున్నారని, కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో బెడ్లు లేక ఒక్కొక్క బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు చొప్పున రోగులు వైద్యం పొందుతూ ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున వెంటనే నిర్మాణం పూర్తయిన 50 పడకల ఆసుపత్రిని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో స్త్రీవైద్య నిపుణులు ఉన్నప్పటికీ ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో కేసులను పార్వతీపురం రిఫర్ చేయాల్సి వస్తుందన్నారు. రోగులకు అందిస్తున్న భోజనం కేవలం ఒక రోగికి రూ.80 కేటాయించడం వల్ల నాణ్యంగా పెట్టలేకపోతున్నారని కావున రూ.150 చొప్పున కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు ఎం.శ్రీనివాసరావు, పువ్వల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



సాలూరు : నిర్మాణంలో ఉన్న ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

సాలూరు: ఏజెన్సీ ముఖద్వారంగా ఉన్న సాలూరు లో వందపడకల ఆసుపత్రి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని అజశర్మ కోరారు. గురువారం ఆయన పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ని పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రత్నకుమారిని కలిసి అందుబాటులో ఉన్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వంద పడకల ఆసుపత్రికి వుండాల్సిన వైద్యులు, సిబ్బంది వున్నారని, వసతి సమస్యగా వుందని చెప్పారు. అనంతరం నిర్మాణం లో వున్న వందపడకల ఆసుపత్రి ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 30 పడకల ఆసుపత్రిని వందపడకల ఆసుపత్రి స్థాయికి అప్ గ్రేడ్ చేయడం హర్షణీయమన్నారు. అయితే 30పడకల ఆసుపత్రిలోనే 80 పడకలు ఏర్పాటు చేయడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఒక పడకమీద ఇద్దరు ముగ్గురు చొప్పున రోగులు పడుకునే పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. దీని వల్ల ఒకరి రోగం మరొకరికి వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. టిడిపి ప్రభుత్వం హయాంలో వందపడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసినందున ఇప్పుడు యుద్ధప్రాతిపదికన నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి చెందిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆసుపత్రి నిర్మాణంపై దష్టి సారించాలని అజశర్మ కోరారు.ఆయన వెంట సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు,కోరాడ ఈశ్వరరావు,ఎం.శ్రీనివాసరావు వున్నారు.



బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

బుద్ధదేవ్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పార్టీ, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు గురువారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో భాగంగా బుద్ధదేవ్ చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, పట్టణ కార్యదర్శి గొర్లె వెంకటరమణ, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ యూనియన్, సిఐటియు నాయకులు తులసీరామ్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బుద్ధదేవ్ భట్టాచార్య 11 ఏళ్ల పాటు పశ్చిమ బెంగాల్ సిఎంగా చేశారన్నారు. రాష్ట్ర, ప్రజల హక్కుల కోసం అనేక ఉద్యమా లు చేపట్టి నేటి ఉద్యమాల్లో కార్మికులు ప్రజలు,యువతకు విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన స్ఫూర్తిగా ప్రజా ఉద్యమ, పోరాటాలు చేపట్టాలని, దేశ ఐక్యతకు నష్టం చేసే మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి, పట్టణ నాయకులు బి.సూరిబాబు, కె.రాజశేఖర్, సిఐటియు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ నాయకులు భాస్కరరావు, గంగాధర్, రాంబాబు, విద్యార్థి నాయకులు పండు, రాజు, అఖిల్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు నివాళు లర్పించారు.

సాలూరు: పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం బుద్ధదేవ్ భట్టాచార్య మృతికి సంతాప సూచకంగా స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడిన ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ భట్టాచార్య చరిత్ర పుటల్లో నిలిచిపోతారని చెప్పారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు మాట్లాడుతూ 11ఏళ్ల పాటు బెంగాల్ ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ భట్టాచార్య సేవలందించారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతి పార్టీకి తీరని లోటుని సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్ అన్నారు. చాలా ఏళ్ల పాటు సిపిఎంలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారనిన్నారు. భట్టాచార్య ఆశ యాలకు అనుగుణంగా ప్రతి ఒక్క నాయకులు, కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ

ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాట్లను గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా బృంద నృత్యాలు, శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసే ప్రదర్శన శాలలు అందర్నీ అవగాహన, ఆలోచింపజేసేలా ఉండాలని సూచించారు. నాణ్యమైన భోజన వంటకాలను అందించాలన్నారు. వర్షం పడినా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్ ప్రూఫ్ పగోడాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం వేదికను పరిశీలించారు. ఈ ఉత్సవాలు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం అవుతుంది. అల్లూరి సీతారామరాజు విగ్రహ ఆవిష్కరణ, అభివద్ధి పనులకు శంఖు స్థాపన, శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలల సందర్శన, సాంస్కతిక కార్యక్రమాలు, అతిథుల సందేశాలు, గిరిజన పెద్దలకు సత్కారాలు ఉంటాయి. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ప్రాజెక్ట్ ఆఫీసర్, ఇతర అధికార అనధికారులు పాల్గొంటారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక, ఐటిడిఎ పిఒఎస్.సేధు మాధవన్, ఆర్డీఓ కె.హేమలత, గిరిజన సంక్షేమ, ఆర్అండ్‌బి ఇంజనీరింగ్ అధికారులు ఎస్.శాంతీశ్వరరావు, ఎమ్.జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : ఐటిడిఎ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘ నాయకులు, ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రజలందరికీ ఆహ్వానం పలుకుతున్నామని ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం కార్యక్రమం ఐటిడిఎలోని ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఉదయం 8:15 గంటలకు ప్రారంభం అవుతుందని తెలిపారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరూ హాజరై ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతం

1598 స్కూళ్లకు 1580 చోట్ల ఎన్నికలు

18 పాఠశాలల్లో వాయిదా

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలోని 15 మండలాల్లో గల1598 వివిధ యాజమాన్య పాఠశాలలకు గాను1580 పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాధికారి పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. బలిజిపేట మండలంలో 56 పాఠశాలలకు గానూ 47 పాఠశాలలకు ఎన్నికలు జరగ్గా చాకరాపల్లి, అజ్జాడ, పెద్దింపేట, చిలకలపల్లి, గంగాడ, పెదపెంకి గ్రామాలకు చెందిన తొమ్మిది పాఠశాలల్లో కోరం చాలా నందున వాయిదా వేసినట్టు తెలిపారు. అలాగే భామిని మండలంలోని 66 పాఠశాలలకు 64 పాఠశాలల్లో ఎన్నికలు జరగ్గా తాలాడ, నులకజోడు గ్రామాలకు చెందిన పాఠశాలల్లో కూడా కోరం చాలా నందున వాయిదా వేశారని, జియ్యమ్మ వలస మండలంలో 96 పాఠశాలలకు 94 పాఠశాలల్లో అధ్యక్షులను ఎన్నుకోగా దంగబద్ర, పెద్దబుడ్డిడి పాఠశాలల్లో కోరం లేక వాయిదా వేశారని, కురుపాం మండలంలో 174 పాఠశాలలకు గాను 173 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయని, ఒక పాఠశాల కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్నందున ఎన్నిక జరగలేదని పేర్కొన్నారు. సీతానగరం మండలంలో 62 పాఠశాలలకు గాను 59 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా అంటిపేట, కొత్తవలస, నిడగల్లు పాఠశాలలో కోరం లేక వాయిదా వేశారని, అలాగే వీరఘట్టం మండలంలో 62 పాఠశాలలకు గాను 61 పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయని కేవలం బొడ్లపాడు పాఠశాల్లో కోరం లేక వాయిదా వేయడం జరిగిందని. జిల్లాలో ఎలాంటి ఘర్షణలు లేకుండా 99శాతం పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, అందుకు సహకరించిన తల్లిదండ్రులను విద్యార్థులతో పాటు ఆయా గ్రామ ప్రజలకు ఆమె అభినందనలు తెలియజేశారు.

ఆదివాసీ జీవితాల్లో వెలుగురేఖలేవీ?

- గిరిజనుల పండగలతో ప్రభుత్వం ఆర్భాటం

మౌలిక వసతులు లేక దుర్భర జీవనం • నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



బతుకు భారం నడక సుదూరం ఆదివాసీ జీవనం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 77 ఏళ్లు పూర్తవుతున్నా మారుమూల గిరిజన పల్లెల్లో ఆదివాసీలకు నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్య హక్కుల ఫలాలు అందని ద్రాక్షగానే ఉన్నాయి. ఏడు దశాబ్దాల కాలంలో ఎన్నో ప్రభుత్వాలు, ఎంతోమంది రాజకీయ నాయకులు, అధికారులు మారినా ఆదివాసీ గిరిజనుల జీవితాల్లో మాత్రం వెలుగురేఖ నిండలేదు. నాటికీ నేటికీ ఆదివాసీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా అంతంత మాత్రంగానే ఉంది. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం అభివద్ధి శూన్యం. కళ్లలో కాంతి లేని ఆదివాసీ బిడ్డలకు నిజమైన పండుగ లేనట్టే. ప్రభుత్వం పండగల పేరుతో ఆర్భాటాలు మాని ఆదివాసీ గిరిజనుల హక్కులు, చట్టాలు పగడ్బందీగా అమలు చేసి వారి హృదయాల్లో చిరునవ్వులు పరిమళించిన నాడే నూటికి నూరు శాతం ఆదివాసీ పండుగ. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక కథనం.

తరతరాలుగా అడవిని నమ్ముకుని బతుకుతున్న ఆదివాసీలకు పాలకుల విధానాలు, కార్పొరేట్ శక్తులతో అడవిలో కూడ రక్షణ కరువైంది. ఆదివాసీల జాగృతి కోసం ఎన్నో చట్టాలు అమలు చేసినా చట్టుబండలుగానే మిగిలిపోయాయి. అమాయకులైన ఆదివాసీల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఆనాటి అల్లూరి సీతారామరాజు నుంచి మొన్న జరిగిన శ్రీకాకుళ రైతాంగ పోరాటం ఉద్యమం వరకు పోరాడి సాధించుకున్న గిరిజన హక్కులు, చట్టాలను నేటి పాలకులు స్వార్థ రాజకీయాల కోసం నిర్వీర్యం చేస్తున్నారు. 1/70, అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, ఎల్‌టిఆర్, ఉపాధి హామీ చట్టం పటిష్టంగా అమలు చేయడం లేదు. గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎ పనితీరు అంతంత మాత్రమే. జిఒ 3 రద్దు, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చే ప్రక్రియ నేటి వరకు జరగలేదు.

గిట్టుబాటు ధర లేని అటవీ ఉత్పత్తులు.....

గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులకు దళారుల బెడద వెంటాడడంతో సరైన గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట మండలాల్లో ఎక్కువ శాతం చింత చెట్లు, జీడి తోటలు ఉన్నాయి. గిరిజనులకు ప్రధానమైన ఈ రెండు పంటలను కూడా ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడంతో వచ్చిన పంటను తక్కువ ధరకే వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి.

సమస్యలతో సహజీవనం.....

పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల పరిధిలో మారుమూల కొండల్లో ఆదివాసీలు వందలాది సమస్యలతో సహ జీవనం సాగిస్తున్నారు. నేటి వరకు గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజన గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ఇక్కడ విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక సౌకర్యాలు నోచుకోని పరిస్థితి. అక్షరాస్యతకు దూరంగా అనారోగ్యంతో మరణాలకు దగ్గరగా జీవనం సాగిస్తున్నారు.

గిరిజన కళలు కనుమరుగు....

ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో రోజు రోజు గిరిజన కళలు కనుమరుగవుతున్నాయి. గిరిజన గ్రామాల్లో సవర, జాతపు, కొండదొర, గదబ గిరిజన తెగలు జీవనం సాగిస్తున్నాయి. వారు నేటికీ సాంప్రదాయ కళలు, ఆచారాలు పాటిస్తున్నారు. డప్పు, తుడుము, సన్నాయి వాయిద్య కళాకారులు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు బాధ్యతతో పని చేస్తున్నారు. గిరిజన కళలు, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా గుమ్మలక్ష్మీపురంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్ల నుంచి కోరుతున్నా ఎటువంటి చర్యలూ లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజన కష్టాలపై దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేయాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి. గిరిజనుల హక్కులు, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. జిఒ 3ను పునరుద్ధరించాలి. 117 జిఒ రద్దు చేసి ఏజెన్సీలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

కోలక లక్ష్మణమూర్తి, మాజీ ఎమ్మెల్యే.

గిరిజనులు ఐక్యంగా ఉద్యమించాలి

రాజ్యాంగం గిరిజనులకు కేటాయించిన హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలి. లేదంటే భవిష్యత్తులో కనుమురుగయ్యే పరిస్థితి ఉంది. పారిశ్రామిక విధానాలకు ఆమడ దూరంలో ఉన్న గిరిజనులు, కొండలపై నివసించే గిరిజనులకు రక్షణ కరువైంది. బిజెపి విధానాల వల్ల గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు కనుమరుగైపోతున్నారు.

కోలక అవినాష్ ,
ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.



అభివృద్ధికి దూరంగా దుర్భర జీవనం సాగిస్తున్న గిరిజనులు

గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలి

గిరిజన సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి. గిరిజనుల కళలు, జీవన విధానం ప్రతిబింబించేలా గుమ్మలక్ష్మీపురంలో గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఆదివాసీ ఉత్సవాలు, కందికొత్తలు పండగ ప్రభుత్వమే నిర్వహించాలి.

మండంగి రమణ, ఆదివాసీ ఉత్సవాల కన్వీనర్.

ఘనంగా ఆదివాసీ దినోత్సవ ప్రారంభ వేడుకలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా"అడవితల్లి"విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ మేరకు గురువారం స్థానిక చర్చి సెంటర్‌లో ఐటిడిఎ పిఒ ఎస్.సేధుమాధవన్, ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు గిరిజన సంఘాల నాయకులు సాదరంగా స్వాగతం పలుకుతూ సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ఐటిడిఎ కార్యాలయం వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అడవి తల్లి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని అడవి తల్లిని వేడుకొన్నారు. శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ముందు రోజు అడవి తల్లికి పూజలు చేసి ఆదివాసీ దినోత్సవానికి ఆహ్వానించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆదివాసిల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని వివరించారు. గిరిజనుల సంతోషమే ప్రభుత్వ ధ్యేయమని అందుకు పూర్తి స్థాయిలో కషి చేస్తామని చెప్పారు. పిఒ సేధు మాధవన్ మాట్లాడుతూ గిరిజన ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయూ ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని అడవి తల్లిని వేడుకొన్నారు. కార్యక్రమంలో ఎపిఒ ఎ.మురళీధర్, పలు గిరిజన సంఘాల నాయకులు పాలక రంజిత్ కుమార్, పల్లా సురేష్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, దుక్క సీతారాం, మంచాల పారమ్మ, కోలక గౌరమ్మ, బిడ్డిక రామారావు, మంచాల ఈశ్వరరావు, బిడ్డిక తమ్మయ్య, జలుమూరి మణికుమార్, ఉర్లక నాగార్జున, మాలతీ దొర, చెల్లూరి సీతారాం, ఆరిక ప్రభాకరరావు, నిమ్మక జయరాజ్, జట్ల బంగారాజు, లోవరాజు, కేటీ.బాబ్జీ, అడ్డాకుల గీతారాణి, అడారిరమణ, మధు, బొత్తాడ గౌరి శంకర్రావు, మండల గిరిధరరావు, తదితరులు పాల్గొన్నారు.



అడవితల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఒ



ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఇసుక అక్రమ రవాణాపై దృష్టి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గోపాలపురంలో ఇసుక అనాధికారక ర్యాంప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం స్థానిక ఆర్‌డిఒ వివి రమణ, భూగర్భ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాంప్‌కు, రోడ్డుకు సహకరించిన రైతు లక్ష్మయ్యపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట డీఎస్పీ జివి కృష్ణారావు, ఎస్సై ప్రశాంత్ కుమార్, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శుక్రవారం ఎర్రసామంతవలస సబ్‌స్టేషన్ పరిధిలోని మార్కొండ పుట్టి ఫీడర్, బొడ్డుసామంతవలస ఫీడర్, మావుడి సబ్ స్టేషన్ పరిధిలోని తుండ ఫీడర్లలో ఉదయం 7గం నుండి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇ వివి కిషోర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పిఎంఐ, ట్రీ కటింగ్ చేపట్టడం వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని దీనిపై ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

సాలూరు: పట్టణంలోని సబ్‌స్టేషన్, మండలంలోని గంగన్నదొరవలస, కురుకుట్టి ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా ఉండదని డిఇ వి.కిశోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పెదకోమటిపేట, డబ్బివీధి, కోటవీధి, మెంటాడ వీధి, పెద్ద వీధి, గుమడాం, శివరాం పురం, పారన్నవరస, పురోహితునివలస, బోరబంద, బాగువలస, సారిక, గంజాయి బద్ర, కురుకుట్టి గ్రామాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివి కిషోర్ కుమార్ ఆదేశాలు మేరకు నాగూరు, గరుగుబిల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నారు. ఈమేరకు విద్యుత్తు సబ్ స్టేషన్ నిర్వహణ పనులతో పాటు ఆయా గ్రామాలకు విద్యుత్తు సరఫరా చేస్తున్న విద్యుత్తు లైన్‌లకు ఆనుకుని ఉన్న చెట్లు కొమ్మలను తొలగించనున్నారు. ఈ విషయాన్ని గమనించాలని మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బొంతాడ శంకరరావు తెలిపారు. మెయింటినెన్స్ పనులు కారణంగా గరుగుబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గొట్టివలస, మరుపెంట, ఉద్దవోలు, చినగుడబ, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.



నిరుపేదలకు వస్త్రదానం చేస్తున్న సంజీవనాయుడు, గౌరీశ్వరరావు

నిరుపేదలకు వస్త్రదానం

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెద్దపల్లిలో గురువారం నిరుపేద కుటుంబాలకు అన్నదానం వస్త్రదానాన్ని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన కోసర్ల గౌరీశ్వరరావు, తన భార్య లక్ష్మి జ్ఞాపకార్థంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరీశ్వరరావు మాట్లాడుతూ తన భార్య జ్ఞాపకార్థం నిరుపేదలకు వస్త్ర, అన్నదానం చేయడం ఎంతో సంతృప్తి ఉందని అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కుటుంబీకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఐటిడిఎ స్థాయిలో చిత్రలేఖనం, వక్తత్వ పోటీలను స్థానిక వైటిసిలో నిర్వహించారు. క్లస్టర్ స్థాయిలో గెలుపొందిన వారికి ఐటిడిఎ స్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 16 మంది విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు ఆదివాసీ దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిసిడిఒ రాములమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

వేగాన్ని నియంత్రించి ప్రాణాలు కాపాడండి

ప్రజాశక్తి - మక్కువ

వాహనాలు నడిపేటప్పుడు ముఖ్యంగా యువత వేగాన్ని నియంత్రించుకోవాలని లేకుంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ఆస్కారం ఉందని సాలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జెవిఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. విధిగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలన్నారు. రహదారులు దాటేటప్పుడు సంకేతాలను గుర్తించుకుంటూ వాహనాలు నడిపించి ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రహదారి భద్రతాధికారి నారాయణరావు స్థానిక కళాశాల ఉపన్యాసకులు విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణ సమితి కో కన్వీనర్‌గా సవరపు రామారావు

ప్రజాశక్తి- సీతానగరం



ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర అడ్వైజర్ కమిటీ కో కన్వీనర్‌గా పెద బొగిలికి చెందిన సవరపు రామారావు నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం మన్యం జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా, మండల పారా లీగల్ వాలంటరీగా పనిచేస్తున్నారు. కో కన్వీనర్‌గా తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘుసత్య సింహా చక్రవర్తి ప్రకటించినట్లు ఆయన తెలిపారు.

అధికారుల ఎక్కువ.. పాలకులు తక్కువ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ తరగతుల్లో అధికారులు ఎక్కువ పాలకులు తక్కువగా హాజరయ్యారు. మండలంలోని 34 మంది సర్పంచులు హాజరవ్వాల్సి ఉన్నప్పటికీ గాదిలంక, చినగారకాలనీ, గదభవలస, విక్రంపురం, చలివేంద్రి పంచాయతీల సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన వారంతా సచివాలయ కార్యదర్శులు హాజరు కావడంతో అధికారులు మమ అనిపించారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి - కురుపాం

ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో గల ఆర్ట్ సంస్థ కార్యాలయం వద్ద సంస్థ డైరెక్టర్ ఎన్. సన్యాసిరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించుకోని గిరిజన యువతకు గిరిజన చట్టాలు హక్కులపైన అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆదివాసులు పండించిన అటవీ ఉత్పత్తులు, వైవిద్యం పెంపొందించడానికి ఆర్ట్స్ సంస్థ దత్తత గ్రామాల్లోని గిరిజన యువతకు నైపుణ్య అభివృద్ధి శిక్షణలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కెవికె కన్సల్టెంట్ ఉమాజ్యోతి, గిరిజన నాయకులు, గిరిజన యువత, యూత్ లీడర్స్ వాలంటీర్స్ పాల్గొన్నారు.



కురుపాం: మాట్లాడుతున్న ఎన్ సన్యాసిరావు

ఆదివాసీ ఉత్సవాలను జయప్రదం చేయండి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే ఆదివాసీ ఉత్సవాలను జయప్రదం చేయాలని ట్రైబల్ రైట్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి రోబ్బలోవ రాజు కోరారు. నియోజకవర్గంలో ఉన్న గిరిజనులందరూ ఆదివాసీ ఉత్సవాలకు హాజరు కావాలన్నారు.

ఆదివాసీల సమస్యలపై పోరాటం

పార్వతీపురం టౌన్: ఆదివాసీ దినోత్సవం అంటే పండగ కాదని ఆదివాసీ సమస్యలపై పోరాట దినమని రైతు కూలీ సంఘం కార్యదర్శి దండులూరి వర్మ న్నారు. ఆగస్టు 9 అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు కూలీ సంఘం జిల్లా సదస్సును గురువారం జిల్లా కేంద్రంలో ఉన్న గిరిజన భవన్ వద్ద రైతు కూలీ జిల్లా అధ్యక్షులు ఊయక ముత్యాలు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన దినోత్సవం జరుపుకోవడం అంటే గిరిజనుల హక్కులను సమస్యలను పట్టించుకోకుండా కేవలం అడవి తల్లి విగ్రహానికి పూల దండలు వేసి, పాలాభిషేకం చేయడం కాదని గిరిజనుల అభ్యున్నతికి కావలసిన మార్పులు, తీసుకోవలసిన చర్యల గురించి చర్చించడం అని చెప్పారు. సభ అనంతరం గిరిజన భవన్ నుంచి కాంప్లెక్స్ మీదుగా లయన్స్ కల్యాణ మండపం వరకు ర్యాలీ చేశారు. ఈ సదసులో రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పీడికి అసిరి, హిమరిక మిన్నారావు, ఎం. భాస్కర్ రావు, కే. వెంకట స్వామి, కందుల పదం సర్పంచ్ తాడంగి కన్నంనాయుడు, కుంతేసు సర్పంచ్ హిమరక పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసి గిరిజన హక్కులను కాపాడే దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంమూర్తి కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులను కాపాడే విధంగా 9వ తేదీన జరగబోయే ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ముందుకు రావాలని కోరారు. మండలంలోని బుధవారం రాత్రి దేవుకోన పంచాయతీ అంటి వలస గ్రామంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా గిరిజన నాయకులు మెల్లిక సన్యాసిరావు ముందుగా జండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో కరెంటు ఆరిపోవడంతో చీకటిలో జండాలు పట్టుకొని చిన్నపిల్లలతో సహా ర్యాలీ నిర్వహించారు. గురువారం మండలంలో శిశాడవలసలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చిలకమ్మా, సంగమ్మ, సీతారాం తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ: మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి

ప్రశాంతంగా ఎస్ఎంసి ఎన్నికలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని శత శాతం ఎస్ఎంసి చైర్మన్లు ఎన్నిక పూర్తయినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎన్. సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 173 పాఠశాలలు ఉండగా అన్ని పాఠశాలలకు మెంబర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఎన్నిక పూర్తయిందని చెప్పారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలో ఉన్న 174 యాజమాన్య పాఠశాలల్లో గురువారం నిర్వహించిన విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 126 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా, 48 పాఠశాలల్లో ఓటింగ్ జరిగింది. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా ఎన్నికైన సొంటేనా రాజేష్‌ను ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: మక్కువ జెడ్‌పి హైస్కూల్ చైర్మన్‌గా కోన ఈశ్వరరావు, ములక్కాయ వలస మోడల్ పాఠశాల చైర్ పర్సన్‌గా సిస్ట్ భారతి ఎంపికయ్యారు. సంబర, ఏ వెంకంపేట మినహా మిగిలిన చోట్ల వైసిపి బలపరిచిన వారే ఎక్కువ శాతం ఎన్నికయ్యారు.

కొమరాడ: మండలంలోని 127 ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికలు నిర్వహించామని ఎంఇఒ జామి నారాయణస్వామి తెలిపారు. ఎటువంటి అల్లర్లు లేకుండా పోలీస్ బందోబస్తు సహాయంతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు.



గుమ్మలక్ష్మీపురం: రాజేష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పాచిపెంట: మండలంలోని 121 పాఠశాలకు సంబంధించి గురువారం విద్యా కమిటీ ఎన్నికలు జరిగాయని ఎంఇఒ పి జోగారావు తెలిపారు.

మూడు చోట ఎన్నిక వాయిదా

సీతానగరం: మూడు చోట్ల స్కూలు యాజమాన్య కమిటీ ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఇఒ జి సూర్యదేముడు తెలిపారు. మండలంలోని 62 పాఠశాలలకు గాను 59 పాఠశాలల్లో గురువారం ఎన్నికలు జరగ్గా అంటిపేట, కొత్తవలస, నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ కమిటీ ఎన్నిక వాయిదా పడిందని చెప్పారు. ఇక్కడ స్థానిక ఎన్నికల మాదిరిగానే ఉధృత పరిస్థితి ఏర్పడడం, కోర్ కమిటీలు లేకపోవడంతో ఎన్నిక వాయిదా వేసినట్లు తెలిపారు.

వీరఘట్టం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికఉన్నత ,జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో గురువారం నిర్వహించిన ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎఇఒ-2 ఆర్.ఆనందరావు తెలిపారు. 62 పాఠశాలల్లో జరగాల్సిన ఎన్నికలు బొడ్లపాడు మినహా మిగిలిన పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

బలిజిపేట : మండలంలో 56 స్కూల్ మేనేజ్మెంట్ కమిటీల ఎన్నికలకు గానూ 49 ఎస్ఎంసిల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఇఒ- 1 సామల సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన 7పాఠశాలల్లో తగిన సంఖ్యలో హాజరు (కోరం) లేకపోవడంతో తదితర కారణాల వల్ల ఏడు పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు వాయిదా వేయడం జరిగిందన్నారు. అలాగే మండలంలోని వెంగాపురం ఎస్ఎంసి ఎన్నికల్లో చైర్మన్‌గా అంపిల్లి సోనియా, వైస్ చైర్మన్‌గా అప్పన్న దొర నియమితులయ్యారు.

కొమరాడ : మండలంలో ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినటు ఎంఇఒ జామినారాయణ స్వామి తెలిపారు. మండలంలోని 127 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు.

జిఒ రద్దు తర్వాతే టీచర్లను సర్దుబాటు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రాథమిక పాఠశాలలను విధ్వంసం చేస్తున్న జిఒ 117ను రద్దు చేసిన తర్వాతే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణారావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి గ్రామంలో ఒకటి నుండి ఐదు తరగతుల వరకు ప్రాథమిక పాఠశాలలు ఉండడం, వారి గ్రామాల్లోనే ప్రాథమిక విద్య అందుతుండేదన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల 3,4,5 తరగతులు చదవడానికి బాల్య దశలోనే గ్రామాంతరం వెళ్లి ఉన్నత పాఠశాలల్లో చదువుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

నూతన ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా 117 జీవోను రద్దు చేస్తానని హామీ ఇచ్చినా నేడు అదే జీవో ప్రకారం ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయడం విచారకరమని వాపోయారు. 117 జీవో రద్దు చేసిన తర్వాతే ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నీతి అయోగ్ లక్ష్యం సాధించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఆశావహ జిల్లాలో భాగంగా నీతి ఆయోగ్ లక్ష్యం సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం నీతి ఆయోగ్ అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. నీతి ఆయోగ్ సూచించిన లక్ష్య సాధనలో జిల్లాలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ అక్టోబరు 6వ తేదీ నాటికి సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. నీతి ఆయోగ్ నిర్దేశించిన సూచికలు అన్నిటిలో మంచి ఫలితాలు సాధించి, ఆశావహ జిల్లాలలో ఆదర్శంగా ఉండాలని ఆయన చెప్పారు. ఆశావహ జిల్లా సూచికలు సాధించడానికి అనేక అంశాలు దోహదం చేస్తాయని చెప్పారు. సంపూర్ణ పోషణ, నైపుణ్య అభివృద్ధి, ప్రకృతి వ్యవసాయం తదితర రంగాల్లో గణనీయమైన అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. సాధ్యమయ్యే ప్రతి అంశాన్ని గుర్తించి మంచి ప్రణాళిక తయారు చేసి, ఆశావహ జిల్లాగా ప్రగతి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యంనాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర రాజు, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి ఎం వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

అధ్వాన రోడ్లు పరిశీలన

ప్రజాశక్తి- పాచిపెంట

మండలంలోని ఆలూరు నుంచి, గాజులమడ మీదుగా పెద్దమడలు, పొలంవలస, మోదుగ వెళ్లే రహదారిని వెంటనే బాగు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్‌చేశారు. గురువారం స్థానిక గిరిజనులు, గిరిజన సంఘం నాయకులు వెలగ రాము, కొల్లూరు రామయ్య, పొట్టయ్యలతో పాటు పాడైపోయిన రహదారులను పరిశీలించారు. రోడ్లు ఉన్నాయని ఆనందం ఎన్నో రోజులు నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ దారుణంగా పాడైపోయాయని టర్నింగ్ పాయింట్‌ల వద్ద గెడ్డ వాగు నీరు రావడంతో రోడ్లు మొత్తం డామేజ్ అయ్యాయని చెప్పారు. అధికారులు యుద్ధ ప్రాతిపదికన సైడ్ వాల్ నిర్మాణం చేపట్టి సిసి ర్యాంపులు వేయాలని టర్నింగ్ పాయింట్ల వద్ద కొండవాగు నీరు రోడ్డు మీదకు రాకుండా కాలువలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ రహదారి ప్రధానంగా పార్వతీపురం మన్యం జిల్లా గిరిజనులతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా, కోరాపుట్ జిల్లా, విశాఖ జిల్లాకు సంబంధించిన కొన్ని గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. దీనిపైన ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టి ఈ రహదారులు బాగు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.



పాడైపోయిన రోడ్డును పరిశీలిస్తున్న ఈశ్వరరావు

అవగాహనతో కేన్సర్ దూరం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన పెంపొందించుకుంటే కేన్సర్‌ను దూరం చేయవచ్చని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో కేన్సర్ అవగాహన గోడ పత్రికలను ఆయన విడుదల చేశారు. మారుతున్న జీవన విధానం ఆహారపు అలవాట్ల వల్ల కేన్సర్ విస్తరిస్తుందని ప్రజలంతా అప్రమత్తమై తగు జాగ్రత్తలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్లాస్టిక్ వాడకం జంగ్ ఫుడ్, కల్తీ ఆహారం, వాయు కాలుష్యం తదితర వాటివల్ల కేన్సర్ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, కావున ప్రతి ఒక్కరూ కాలుష్యం నియంత్రణకు కృషి చేస్తూ సంప్రదాయ పంట ఉత్పత్తులను ఉపయోగిస్తూ ఆరోగ్యాన్ని భద్రపరుచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. పిహెచ్‌సి జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి సింహాచలం సెక్రటరీ నడిమింటి గోపాలనాయుడు, బి.శంకర్రావు, ఎం.చిరంజీవులు, పి.శ్రీరాములు, రెడ్డి గౌరునాయుడు, ఎస్.సీతారాం, డివి రమణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్ చంద్ర

సాంబ మసూరికి బదులు ఆర్‌జిఎల్ 7039

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రస్తుత వాతావరణంలో సాంబ మసూరి రకానికి దోమపోటు, అగ్గి తెగులు ఉధృతంగా ఆశించడం వల్ల ఆశించిన స్థాయి దిగుబడి రాకపోవడమే కాకుండా గింజల నాణ్యత కూడా దెబ్బతింటుందని, కావున సాంబ మసూరి రకానికి బదులుగా ప్రత్యామ్నాయ రకాన్ని పరిశీలించడం కోసం చిరు సంచులలో ఉన్న ఆర్‌జిఎల్ 7039 రకాన్ని వినియోగించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు రైతులకు సూచించారు. మండలంలోని పాంచాలిలో రైతు కొల్ల సత్తిరాజు క్షేత్రంలో సాగువుతున్న ఈ నూతన రకం మొదలు గట్టిగా ఉండి చేను పడిపోదని, ఆకు ఎండి తెగులు దోమపోటును తట్టుకుంటుందని అన్నారు. ఎంటియు 1062, ఎంటియు 1075 రకాలను సంపర్కం చేయగా, ఆర్‌జిఎల్ 7039 రకం సన్నగింజ ఉండి తినడానికి బాగుంటుందని తెలిపారు. దీని కాల పరిమితి 145 రోజులని తెలిపారు. కార్యక్రమంలో విఎఎలు ఈదుబిల్లి శ్రీను, ఎపిసిఎం ఎఫ్ఎల్ఎన్ తిరుపతి నాయుడు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి తిరుపతిరావు



సత్యంనాయుడును సత్కరిస్తున్న డిప్యూటీ డిఇఒ, తదితరులు

సత్యంనాయుడు సేవలు భేష్

ప్రజాశక్తి -సీతంపేట

ఏజెన్సీలో 25 ఏళ్లుగా నెల్లి సత్యం నాయుడు ఉపాధ్యాయుడిగా సేవలందించి గిరిజనులతో శభాష్ అనిపించుకున్నారని డిప్యూటీ డిఇఒ పి.నారాయుడు, గ్రామస్తులు కొనియాడారు. మండలంలోని పెద్దూరు పాఠశాలలో సత్యంనాయుడు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయుడు మాట్లాడుతూ 1998లో ఉప్పర జమ్మిలో ఉద్యోగం జీవితం ప్రారంభమైందన్నారు. అనంతరం పెద్దూరు, మొగదర తదితర ప్రాంతాల్లో సేవలందించారన్నారు. ఇప్పటికీ పేద విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు ఉచితంగా పంపిణీ చేస్తారని అన్నారు. ఏజెన్సీలో ఆదర్శ ఉపాధ్యాయుడిగా నిలిచారని చెప్పారు. ఆయన సేవలు మెచ్చుకొని శాలువతో సత్కరించారు. అనంతరం పాఠశాల ఎస్ఎంసి చైర్మన్‌గా కె.చిట్టెమ్మ, వైస్ చైర్మన్‌గా బి దివ్య ఎన్నికయ్యారు. మండలంలోని ఇప్పటికీ 169 పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కార్యక్రమంలో గ్రామ నాయకులు మోహన్ రావు, సర్పంచ్ ఆదిలక్ష్మి ఎంఇఒ సూర్యచంద్రమౌళి, ఆనందరావు, హెచ్‌ఎం ప్రసాద్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలి : ఎస్ పి

ప్రజాశక్తి -భామిని, సీతంపేట

ఒరిస్సా నుంచి వచ్చే గంజాయి, నాటు సారా రవాణా అరికట్టడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మన్యం జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవ రెడ్డి తెలిపారు. గురువారం బత్తిలి, దోనుబాయి పోలీస్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, సిబ్బంది ఎంత మంది విధుల్లో వున్నారని అడిగారు. ఒరిస్సా నుంచి వచ్చే ప్రతీ వాహనం తనిఖీ చేసి గంజాయి, నాటు సారా అక్రమ రవాణా అరికట్టాలని పోలీస్ సిబ్బందిని సూచించారు. బత్తిలి చెకపోస్ట్ పరిశీలించి పూర్తి స్థాయిలో నిఘా ఉంచాలని తెలిపారు. నేరడి బ్యారజీని పరిశీలించారు. కార్యక్రమంలో బత్తిలి ఎస్‌ఐ సిహెచ్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



భామిని: పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి

రైతులపై కర్రలతో దాడి

పలువురికి తీవ్ర గాయాలు

భామిని: భామినికి చెందిన ముగ్గురు రైతులపై లివిరిలోని గొల్ల కాలనీకి చెందిన ఆరుగురు వ్యక్తులు కర్రలతో దాడి చేయడంతో బాధితుల తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. బత్తిలి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ప్రకారం భామినికి చెందిన రైతు గురిబిల్లి సురేష్ తన పొలం గట్టుపై మొక్కలు నాటాడు. గొల్లకాలనీకి చెందిన తులసిదాస్ అనే వ్యక్తి ఒక మొక్కలు పెరిగేతే, చుట్టు పొలాలకు నీడ వస్తుందని సురేష్‌పై దాడి చేశాడు. సురేష్ ఇంటికి వెళ్లి తన అన్న లక్ష్మీపతికి తెలిపాడు. లక్ష్మీపతి వెంటనే తప్పులేకుండా కొట్టడం సమంజసంకాదని మరికొంత రైతులతో కలిసి లివిరి గొల్ల కాలనీ వాసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో లక్ష్మీపతి, గోకర్ల రాజు, గోరుశెట్టి భూపతిపై తులసీదాసు వర్గీయులు కర్రలతో దాడి చేశారు. క్షతగాత్రులను సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు.

నాటు సారా, మద్యం ధ్వంసం

మక్కువ : మండలంలోని కొద్ది రోజులుగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ నాటు సారా, మద్యం సీసాలను గురువారం ధ్వంసం చేశారు. ఎఎస్‌పి సునీల్ షోరూన్ సమక్షంలో 647 సారా ప్యాకెట్లు, 150 మద్యం సీసాలను రోడ్డుపై వేసే ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ నరసింహమూర్తి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన వ్యాను

ప్రజాశక్తి - కురుపాం

అదుపు తప్పి పికప్ వ్యాను టిఫిన్ దుకాణాన్ని ఢీ కొట్టి టిఫిన్ దుకాణంతో పాటు కాలువలో పడిన సంఘటన మండల కేంద్రంలో గురువారం వేకువజామున చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో పికప్ వ్యాను పార్వతీపురం నుంచి కేదారిపురం వెళ్తుండగా కురుపాం రోడ్డు సమీపంలో ఉన్న టిఫిన్ బండిని ఢీ కొట్టి కాలువలో పడింది. అయితే ఆ సమయంలో టిఫిన్ దుకాణానికి టిఫిన్ కొట్టు తీయకపోవడం, జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పి ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిద్ర మత్తు వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.